భద్రతకు బడ్జెట్ పెంచాలి



కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్యరంగానికి కేవలం రెండుశాతం నిధులే కేటాయిస్తున్నారు. వాస్తవానికి అది కనీసంగా ఐదుశాతమైనా ఉండాలి. కార్పొరేట్ హాస్పిటళ్లలో ఉన్న విధంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటళ్లలో భద్రత ఉండట్లేదు. దీనికోసం ఖచ్చితమైన చట్టం చేసి దానిని పకడ్బందీగా అమలు చేస్తే డ్యూటీ డాక్టర్లకు రక్షణ బాగుంటుంది.

–డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వరరావు, సీనియర్ పీడియాట్రిక్, నరసరావుపేట



భద్రత చాలా ముఖ్యం

ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటళ్లలో సెక్యూరిటీ సిస్టం చాలా అధ్వానంగా ఉంటుంది. డ్యూటీ చేసే పీజీ డాక్టర్లకు ఏమాత్రం సౌకర్యాలు ఎక్కడా ఉండవు. నేను సౌకర్యాలు లేని పరిస్థితిలో పనిచేసిన బాధితుడినే. ఒకోసారి 48 గంటలు కూడా పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. ఒకసారి ఎంటరైతే మళ్లీ బయటకు ఎప్పుడు వస్తామో తెలియదు. డ్యూటీలు చేసే మహిళలైనా, పురుషులకైనా వారికి ఉండే రెండు మూడు గంటల సమయంలో భద్రంగా పడుకునేందుకు బెడ్, ఒక ఫ్యాన్, మరుగుదొడ్డి కనీసంగా ఉండాలి. ఇవికూడా లేని పరిస్థితుల్లో ప్రభుత్వ రంగం ఉండటం దురదృష్టకరం.

–డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, శ్రీ దత్తా హాస్పిటల్స్, నరసరావుపేట



క్లుప్తంగా

ఉపాధ్యాయుడు జాఫర్‌కు పురస్కారం



చిలకలూరిపేట: పట్టణానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు షేక్ జాఫర్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యాడు. సదరన్ ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. ఈ నెల 25న గుంటూరులోని ఏసీ కళాశాల ఆడిటోరియంలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహిస్తారు. దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాలల నుంచి ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఈ కార్యక్రమం ద్వారా సన్మానం అందుకోనున్నారు. దశాబ్దం పైబడి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న జాఫర్ ప్రైవేటు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు నిర్వహించి ఉన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం కాంపిటేటివ్ కోచింగ్ సెంటర్ ద్వారా విద్యార్థులకు, నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. ఆయనకు పురస్కారం లభించటం పట్ల పలువురు పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఘంటా నాగేశ్వరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ కామసాని చిన్న ఆంజనేయులు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ సురేష్, గ్రామ సెక్రటరీ రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టూటౌన్ సీఐగా హైమారావు



నరసరావుపేట టౌన్: నరసరావుపేట టూటౌన్ సీఐగా ఎం. హైమారావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పని చేసిన ఎ.భాస్కర్‌ను వీఆర్‌కు బదిలీ చేయగా, గుంటూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న హైమారావును ఆయన స్థానంలో నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ మాట్లాడుతూ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. రాత్రిళ్లు పోలీస్ పెట్రోలింగ్ పెంచి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, చోరీలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్‌ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచుతామని తెలిపారు.

శ్రావణ శుక్రవారం వేడుకలు



రొంపిచర్ల: మండలంలోని పలు దేవాలయాల్లో శ్రావణ శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. విప్పర్లలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత వల్లభేశ్వర స్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పరమేశ్వరశర్మ నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఈపూరు మండలంలో గ్రామసభలు

ఈపూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఆయా గ్రామాల్లో పనులు గుర్తించేందుకు శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి రమణారెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముందుగా సభ ఉందని చెప్పరా?

- ఉపాధి ప్రణాళికలు మాకు తెలియకుండా ఎలా రూపొందిస్తారు?
- గ్రామసభలో అధికారుల తీరుపై మండిపడిన స్థానికులు



శావల్యాపురం గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న స్థానిక నాయకుడు

శావల్యాపురం: ఉపాధి గ్రామ సభ జరుగుతున్న విషయాన్ని ముందుగా ఎందుకు ప్రచారం చేయలేదు? అసలు ఉపాధి నిధులతో ఏఏ పనులు చేస్తారో సమాచారం లేకుండా ప్రణాళికలు ఎలా రూపొందిస్తారు? అంటూ అధికారులను గ్రామస్తులు, స్థానిక నాయకులు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో మండల అధికారుల తీరుపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఉపాధి గ్రామసభ గురించి ముందస్తుగా మైకుల ద్వారా ప్రచారం నిర్వహించకుండా గ్రామసభను నామమాత్రంగా ఏ విధంగా జరుపుతారంటూ వారంతా నిలదీశారు. అలాగే గ్రామంలో సమాచారం లేకుండా ఉపాధి నిధులతో చేపట్టబోయే పనుల గురించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు ఏవిధంగా రూపొందిస్తారని అధికారులను ప్రశ్నించారు. అసలు గ్రామసభలో షోడో సర్పంచ్ కూర్చోవడం ఏమిటని ప్రోటోకాల్ పాటించాల్సిన బాధ్యత అధికారులపై లేదాని ప్రశ్నించారు.

శావల్యాపురంలో మూడు నెలలుగా కొన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగటం లేదనే విషయంపై పలుమార్లు అధికారులకు తెలిపినా ఇప్పటి వరకు స్పందన లేదని పలువురు సభ దృష్టికి తెచ్చారు. గ్రామంలో అనధికార మోటార్లు ఏర్పాటు చేయటం వలన బీసీ కాలనీలో రక్షిత మంచినీటి పథకం తాగునీటి కోసం కాలనీ వాసులు అగచాట్లు పడుతున్నారని కాలనీవాసులు వాపోయారు. గ్రామంలో ఉన్న మంచినీటి చెరువుకు ఫెన్సింగ్ లేనందున పాడిగేదెలు చెరువులోకి దిగుతున్నాయని, ఉపాధి నిధులతో సత్వరమే ఫెన్సింగ్ పనులు చేయించాలన్నారు. గ్రామంలో చెత్తనుంచి సంపద తయారు చేసే కేంద్రం నిరుపయోగంగా మారటం వల్ల అక్కడ వేసిన వ్యర్థాలు వల్ల భవిష్యత్‌లో గ్రామస్తులు పలురకాల ఇబ్బందులు పడుతారన్నారు.

రెండ వార్డు సభ్యులు జుజ్జురి రామమూర్తి మాట్లాడుతూ పంచాయతీ నిధులు రూ.4 లక్షలు దుర్వినియోగమయ్యాయని సత్వరమే అధికారులు విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామసభలో ప్రజలు తెలిపిన సమస్యలన్నింటినీ అధికారులు లిఖిత పూర్వకంగా నమోదు చేసుకున్నారు. ఈ గ్రామసభలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, పంచాయతీ కార్యదర్శి కానుగంటి మహేంద్ర, ఏపీవో కె.రామారావు, సీసీ గొట్టం రమాదేవి పాల్గొన్నారు.

మంచినీటి పథకం బాగుచేయాలి

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో పంచాయతీ పరిధిలో ఉన్న రక్షిత మంచినీటి పథకం సక్రమంగా పనిచేయటం లేదని గ్రామమాజీ సర్పంచ్ ముంద్రు హనుమంతరావు శుక్రవారం లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు. సమస్యలన్నింటిని లిఖిత పూర్వకంగా వినతి రూపంలో సర్పంచ్ యలగాల బసవయ్య, పంచాయతీ కార్యదర్శి సూరిలకు గ్రామస్తులు అందజేశారు.

ఉపాధి హామీ గ్రామసభలు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం 2024–25కు సంబంధించి గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీరభద్రాచారి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో జరిగే గ్రామసభల్లో మండల అధికారులు పాల్గొని విజయవంతం చేసినట్లు తెలిపారు. చేపట్టే అభివృద్ధి పనులు గుర్తింపు, ప్రణాళిక ప్రక్రియను రూపొందించుకునేందుకు గ్రామసభలు ఉపయోగపడతాయన్నారు. కోటప్పనగర్‌లో జరిగిన గ్రామసభలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో....

బొల్లాపల్లి: గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన ఉపాధి హామీ గ్రామ సభలు ప్రశాంతంగా జరిగాయని ఎంపీడీవో షేక్ గౌసియా బేగం తెలిపారు. మండలంలోని గరికపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎం.ఏడుకొండలు అధ్యక్షతన శుక్రవారం జరిగిన గ్రామసభలో ఎంపీడీవో పాల్గొని గ్రామసభల ఉద్దేశం తెలిపారు. ఆయా గ్రామసభల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో పాటు అధికారులు, ఈవోపీఆర్‌డీ షేక్ జిలానీబాషా, ఏపీవో పి.వెంకటేశ్వర్లు, పీఆర్‌ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు షేక్ అల్లాభక్షు,ఆకాష్ నాయక్‌లు, సాంకేతిక, క్షేత్రసహాయకులు, గ్రామపెద్దలు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కూలీ బకాయిలు చెల్లించాలి

నాదెండ్ల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకం గ్రామ సభలు ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. నాలుగేళ్ళ తర్వాత గణపవరంలో గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలోజరిగిన గ్రామసభకు ప్రత్యేకాధికారి, ఎంపీడీవోజాకీర్‌హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు. తూబాడులో సర్పంచ్ గోళ్లమూడి కాశియ్య, ఉపసర్పంచ్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో సుమారు రూ.5 లక్షల మేర కూలీ బకాయిలు అందాల్సి ఉందని పలువురు ప్రశ్నించారు. ఇటీవల జరిగిన సోషల్ ఆడిట్‌లో ఈ అంశం ప్రస్తావన జరిగిందని వివరించారు.

సమస్యలు పరిష్కరించండి సారూ..



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ పంచాయతీలో నిర్వహించిన జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామసభలో బీజేపీ మండల నాయకులు గట్టుపల్లి శ్రీనివాసరావు పలు రకాల సమస్యలను పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డికి శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వేల్పూరు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నటువంటి వెలమవారిపాలెం గ్రామానికి వెళ్ళు రహదారి మార్గం అధ్వాన్నంగా ఉండటం రాకపోకలకు అగచాట్లు పడుతున్నారన్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న వెలమవారిపాలెం గ్రామానికి రవాణా సౌకర్యం, ఆరోగ్య కేంద్రం, సచివాలయం, కమ్యూనిటీ హాల్, పోలింగ్ కేంద్రం పూర్తిస్థాయిలో నిర్మాణం కానీ సీసీ రోడ్లు, సైడు డ్రైనేజీలు వంటి కనీస సౌకర్యాలు లేని పరిస్థితుల్లో వెలమవారిపాలెం గ్రామస్తులు బతుకు పోరాటం చేస్తున్నారన్నారని విన్నవించారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు

ఏడీఏ రవిబాబు



శావల్యాపురం ఎరువుల దుకాణంలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

శావల్యాపురం: ఖరీఫ్ సీజను ప్రారంభమైందని ఎరువుల అధిక ధరలకు అమ్మితే అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఏడీఏ బోయపాటి రవిబాబు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రం శావల్యాపురంలో ఎరువుల దుకాణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఎరువులు ఎంఆర్‌పీ ధరల కంటే అధిక ధరలకు అమ్మే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రవేటు మార్కెట్‌లో ఎరువులు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని బిల్లులపై సంబంధిత రైతు సెల్‌ఫోన్ నంబరు రాయాలన్నారు. ఎరువులు పారదర్శకంగా అమ్మకాలు జరగాలని ఎలాంటి అవకతవకలు ఫిర్యాదులు తావులేకుండా దుకాణ యజమానులు బాధ్యత వహించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.ఆయనతో పాటు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, దుకాణ యజమాని కొంగల వాసు రైతులు పాల్గొన్నారు.

శివాపురం ఎత్తిపోతలకు మరమ్మతులు చేయించండి



రైతులతో కలిసి నిరసన తెలియజేస్తున్న రాము

వినుకొండ(నూజెండ్ల): మండల పరిధిలోని శివాపురం ఎత్తిపోతల పథకాన్ని వెంటనే మరమ్మతులు చేయించి 5 వేల ఎకరాల సాగు భూమిని బీడు భూములను కాకుండా కూటమి ప్రభుత్వం ఆయకట్టు రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము అన్నారు. మండలంలోని చీకటీగల పాలెం గ్రామంలో గల శివాపురం ఎత్తిపోతల పథకాన్ని ఆయన సందర్శించి రైతులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పథకానికి మరమ్మతులు చేపడితే శివాపురం, భారతాపురం, పానకాలపాలెం, శ్రీరామ్‌నగర్, తిమ్మాయపాలెం, చీకటీగలపాలెం పంచాయతీల్లోని 5 వేల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, అంజిరెడ్డి, ఎం. వెంకటేశ్వరరెడ్డి, పెద్ద ఎలమందరెడ్డి, పాపిరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంతో గ్రామరూపురేఖలు మారుస్తాం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



నాదెండ్ల గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల రూపురేఖలు మారేలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం పనుల ఎంపిక గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకేసారి గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి ఎస్.సంజీవరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రాజారమేష్, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, కార్యదర్శి మారుతిబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరిముల్లా, పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు.

తూబాడు వీఆర్వో మృతి



కోటేశ్వరరావు

నాదెండ్ల: తూబాడు వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న విప్పర్ల కోటేశ్వరరావు (54) అనారోగ్యంతో మృతిచెందారు. గత కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. శుక్రవారం ఉదయం మంగళగిరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. సాయంత్రం 5 గంటల సమయంలో ఆరోగ్యం విషమించి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న వీఆర్వోలు, వీఆర్‌ఏలు, రెవెన్యూ సిబ్బంది ప్రగాఢ సంతాపం తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ఐకమత్యంతో పనిచేయాలి

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



రొంపిచర్ల గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకొని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. మండలంలోని ఇస్సప్పాలెంలో శుక్రవారం నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, ఆర్‌డీవో సరోజిని, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో చేపట్టనున్న పనులపై అవగాహన కోసం గ్రామసభలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే రొంపిచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, ఎంపీడీవో మ్యాథ్స్‌బాబు, సర్పంచ్ టి.జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్స్

నరసరావుపేట రూరల్: నేషనల్ స్పేస్ డేను పురస్కరించుకుని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో 23వ ఆంధ్రా బెటాలియన్ హవల్దార్ దీపక్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌లు పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో 15 టీంలు పాల్గొన్నాయి. ప్రతిభ కనబర్చి విజేతలుగా క్యాడెట్స్‌కు షీల్డ్‌లు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

గోగులపాడులో ఎంఈవో తనిఖీ



తరగతి గదులను పరిశీలిస్తున్న ఎంఈవో హవీలా

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను మండల విద్యాశాఖ అధికారి పి. హవీలా శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థినీ, విద్యార్థుల నోట్ బుక్స్‌ను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతను, మరుగుదొడ్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డేటాఎంట్రీ ఆపరేటర్ దావులూరి మస్తాన్, ప్రధానోపాధ్యాయులు పి. భానుశ్రీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కనకాచారి సంస్మరణ సభ

చిలకలూరిపేట: దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) వ్యవస్థాపక సభ్యుడు కనకాచారి 19వ సంస్మరణ సభ ఈ నెల 25న పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పీడీఎం నాయకులు షేక్ సత్తార్ తెలిపారు. సభలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, విరసం అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ, పీడీఎం రాష్ట్ర కార్యదర్శి కె వెంకటేష్, ఏబీఎంఎస్ అధ్యక్షురాలు బొప్పూడి అంజమ్మ వక్తలుగా పాల్గొంటారని తెలిపారు. ప్రజా కళామండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

925 పనులకు అంచనాలు

శావల్యాపురం: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని 15 గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామసభల నుంచి 925 పనులకు గాను రూ. 7 కోట్లు 14 లక్షల అంచనాలు చేసి తీర్మానాలు చేసినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య శుక్రవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ గోకుల్ షెడ్లు, సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, నీటి కుంటలు, పండ్ల తోటలు, పంట కాల్వలు తదితర వన్నీ అభివృద్ధి పనులు చేయడానికి గ్రామ పంచాయతీల్లో ప్రజల నుంచి అర్జీల రూపంలో అందాయని, వీటి న్నింటినీ నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

ముగిసిన ఔత్సాహిక వ్యాపార శిక్షణ



ఔత్సాహిక వ్యాపారవేత్తల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న యువతతో నైపుణ్యాభివృద్ధి సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా వాగ్దేవి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఔత్సాహిక వ్యాపార యువత శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. బ్యాంకింగ్ రంగానికి చెందిన లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ కె. రాంప్రసాద్ కార్యక్రమంలో పాల్గొని నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి రుణాలు పొందే విధానాన్ని వివరించారు. అలాగే ప్రభుత్వం రాయితీపై అందించే రుణ వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె. సంజీవరావు, కళాశాల ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్, నైపుణ్యాభివృది సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎయిడ్స్ నివారణ–నియంత్రణ సంస్థ, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పిట్టంబండ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై మీకు తెలుసా అనే కార్యక్రమం గురించి తెలియజేశారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ ఎలా వ్యాపించదు, ఎలా వ్యాపిస్తుంది, దాని లక్షణాలు, నివారణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. టోల్ ఫ్రీ నంబరు 1097 పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీబాయి, ఐసీటీసీ కౌన్సిలర్ సురేష్, సంస్థ మేనేజర్ ఉదయరాజు, కొండలు, రిబ్కా, రాజు, విజయ, గ్రామప్రజలు పాల్గొన్నారు.